నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఆగస్టు 19, 2024 | www.navatelangana.com

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్ప వరద

నవతెలంగాణ-నిజాంసాగర్



మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి 750 క్యూసెక్కుల స్వల్ప వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4.176 టీఎంసీల నీరు ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి దేవర్ల సాయికుమార్ (22) ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందాడని రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బిలోలి గ్రామానికి చెందిన సాయికుమార్, అతని స్నేహితుడు ఉదయ్ కిరణ్ ఆదివారం ఉదయం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం రెండవ ఘాటు వద్ద స్నానం చేస్తుండగా కాలుజారి గోదావరిలో పడి నీటమునిగి మృతి చెందాడు. మృతుడి అన్న దేవర్ల రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమిద్దాం

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్
- బహుజన వాది సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు
- పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా నివాళి



లింగంపేట్ : జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కంఠేశ్వర్ : విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్/కంఠేశ్వర్

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనుల రాజ్యాధికారం కోసం ఉద్యమిద్దామని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్.. సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించి గోల్కొండ కోటని రాజధానిగా చేసుకుని బహుజనుల రాజ్యాన్ని స్థాపించిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. క్రూరమైన పాలకుల దౌర్జన్యాన్ని, అరాచక పాలనను, ముస్లిం జమీందారులపై నిరంతరం దాడులు చేసిన గందర గండడు 1710లో పాలకులకు వ్యతిరేకంగా జరిగిన భీకర యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినా వెన్నుచూపని వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తెలిపారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని గౌడ కులస్తులకు, కల్లుగీత కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్‌గౌడ్, బాబా గౌడ్, లింగంగౌడ్, రవీందర్‌గౌడ్, నారాగౌడ్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడినుంచి కలెక్టర్ ఆఫీస్‌లో జరిగే అధికారిక సభకు ర్యాలీగా వెళ్లి అందులో పాల్గొని ప్రసంగించారు. ఆనాడు పేద గౌడగీత కార్మిక కుటుంబంలో పుట్టిన సర్వాయి పాపన్న తన వృత్తిని కొనసాగిస్తూనే మొగలు సామ్రాజ్య సామ్రాట్ ఔరంగజేబు పరిపాలనలో తెలంగాణను పట్టిపీడిస్తున్న రెడ్డి దొరలు, వెలమదొరలు, కరణం దొరలు, ముస్లిం దొరలు ఆ పాలకులకు తొత్తులుగా ఉన్న మరికొందరి దౌర్జన్యాలతో తెలంగాణ ప్రజలు విసిగివేసారి పోయి అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నారని, దాన్ని చూడలేక మనసు చలించి 12 మంది తన బహుజన వీరులతో గొరిల్లా పోరాటం ప్రారంభించిన సర్వాయి పాపన్న 2000 మంది సైన్యాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ సంస్థలను ఓడించి గోల్కొండ ఖిల్లాను కేంద్రంగా చేసుకొని 7 నెలల పాటు రాజులా పరిపాలించిన ఘనత సర్వాయి పాపన్నదని కొనియాడారు. వెనుకబడిన తరగతుల వర్గం నుంచి మహారాజు అయిన ఘనత తొలి తెలంగాణ గౌడ వీరుడు పాపన్నకే దక్కిందన్నారు. 350 సంవత్సరాల క్రితమే బహుజనులను ఏకం చేసిన బహుజన వాది సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు కోయేడి నరసింహులు గౌడ్, సిదుగు శేఖర్‌గౌడ్, పెద్ది సూరి గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నరేష్, అరవింద్‌గౌడ్, లక్ష్మీ నర్సాగౌడ్, బి.సాయిగౌడ్, భీంగల్ పి.రామగౌడ్, పార్వతి శ్రీనివాస్‌గౌడ్, దశరథ్‌గౌడ్, నారాగౌడ్, గంగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో.. బడుల్లోనూ తాగేస్తున్నారు

మందుబాబులు అడ్డగా మారిన సర్వీస్ రోడ్లు





రోడ్డుపక్కన బీరు సీసాలు, మద్యం సీసా ముక్కలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161 మండల కేంద్రంలో ఉన్న సర్వీస్ రోడ్డులో మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు కిలోమీటర్ మేరకు ఎటు చూసినా పగిలిన సీసాలు, బీరు బాటిల్లే కనపడుతున్నాయి. ప్రధాన రహదారుల పక్కనున్న కల్వర్టులు, బహిరంగ ప్రదేశాల్లోనే కాకుండా ప్రభుత్వ బడుల్లో సైతం బహిరంగంగానే మద్యం సేవిస్తుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్న పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్నతక్కడపల్లి, బేగంపూర్, పెద్దదేవిసింగ్ తాండ, సముందర్ తాండ, అంజని గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మందు బాబులు మద్యం సేవించడమే కాకుండా సేవించిన ఖాళీ సీసాలు ధ్వంసం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం అనేకమంది మందు బాబులు బీరు సీసాలతో దర్శనమిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీసాలు పగులగొడుతూ..

బహిరంగ ప్రదేశాల్లో పంట భూముల పక్కన మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను పగుల గొట్టి పంట భూముల్లో వేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పొలం భూముల్లో వేయడంతో రైతులు నీరుపెట్టి దమ్ము చేసే సమయంలో కాళ్లకు కుచ్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్లపైనే పగులగొడుతున్నారు. దీంతో రోడ్లవెంబడి వెళ్లేవారు ఆ ప్రాంతాల్లో వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంబులెన్స్ సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-బోధన్



సన్మానం పొందిన అంబులెన్స్ సిబ్బంది

బోధన్ మండలం బిక్నెల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి మొదటి కానుపు నిమిత్తం పురిటి నొప్పులు అధికమవడంతో పేషెంట్ బంధువులు 108 అంబులెన్సుకు కాల్ చేశారు. దాంతో తక్షణమే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గర్భిణీని అంబులెన్స్ ద్వారా బోధన్ ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. అంబులెన్స్ సిబ్బంది చొరవతో తల్లి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తల్లి బిడ్డలు ఇద్దరు హాస్పిటల్‌లో క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ కుటుంబ సభ్యులు కృతజ్ఞత భావంతో అంబులెన్స్ సిబ్బంది నాగరాజు, నయీముద్దీన్, శ్రీరాములును శాలువాతో సన్మానించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కె.రాజనర్సు

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కె.రాజనర్సు

కలకత్తాలో డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడ్డ దుండగులను బహిరంగంగా శిక్షించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కె.రాజనర్సు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్‌పై హత్యాచారానికి హత్యకు పాల్పడిన వాళ్లని బహిరంగంగా శిక్షించాలని అన్నారు. దేశంలో కులం, మత బేధం లేకుండా.. ఉన్నోడు లేనోడనే తేడా లేకుండా సేవచేసే వారు డాక్టర్లు మాత్రమేనని తెలిపారు. మన ప్రాణాలను కాపాడే డాక్టర్లకే మన దేశంలో రక్షణ కరువైతే ఇంకెవరికి రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. రోజురోజుకు మహిళల పట్ల విద్యార్థునుల పట్ల జరిగే అత్యాచారాలను చేసేవారిని నిర్భయ పోక్సో లాంటి చట్టాలు ఉన్న అమలు కావడం లేదని అన్నారు. వెంటనే దోషులకు శిక్షపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు పోతారం ప్రభాకర్, కాత్రియాల ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

రాఖీ దుకాణాల వద్ద కిటకిట



నవతెలంగాణ-లింగంపేట్

రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని రాఖీ దుకాణాలు వెలిశాయి. సోమవారం రాఖీ పండుగ నేపథ్యంలో ఆదివారం నుంచే రాఖీలు కొనేందుకు మహిళలు పోటీపడ్డారు. దీంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. రాఖీలతో పాటు వివిధ రకాల స్వీటు బాక్సులను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు.

వెంటనే రుణమాఫీ చేయాలి

- రైతుల రాస్తారోకో
- సీఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సదాశివనగర్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

ప్రభుత్వం రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉంటే చెల్లింపు చేయాలనడం సరికాదని, ప్రభుత్వం వెంటనే రెండులక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల రైతులు మండలంలోని మోడేగాం స్టేజీ వద్ద వజ్జపల్లి తండాలో గాంధారి రోడ్డుపై పార్టీలకు అతీతంగా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చెరుకుని రాస్తారోకోను విరమింపజేశారు.

రజకులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

- గ్రామాభివృద్ధి కమిటీ పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-నిజామాబాద్



బాధితులతో కలిసి మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో 8 నెలల నుంచి రజకులపై కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేసి, సాంఘిక బహిష్కరణకు పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో బహిష్కరణకు గురైన బాధితులను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రజకుల అసైన్మెంట్ భూమిని కబ్జా చేయాలని పెత్తందారులు ప్రయత్నించడాన్ని రజకులు వ్యతిరేకించినందుకు సాంఘిక బహిష్కరణ చేశారని రజక, మహిళలు, యువకులు ఆశయ్య దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బహిష్కరణకు సంబంధించిన కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్/కామారెడ్డి



కంఠేశ్వర్ : సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో



కామారెడ్డిలో..

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లో గల సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్, నగర మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్నగౌడ్ కనబర్చిన పోరాట తెగువ అనన్యసామాన్యమైనదని కొనియాడారు. మొఘల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన ధీశాలి సర్వాయి పాపన్న మహరాజ్ అని గుర్తు చేశారు. పాపన్నగౌడ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని బహుజనులంతా ఏకతాటిపైకి చేరి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం గౌడ సోదరులు ఐకమత్యంతో కృషి చేయాలన్నారు. ఐ.డీ.ఓ.సీలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి మాట్లాడుతూ.. రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసామాన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సర్వాయి పాపన్న తెగువను కొనియాడారు. నాటి దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. మొఘల్ రాజులను ఎదురించి గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని, ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరూ సమానులేననే భావన పెంపొందేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. గీత కార్మికులు సమిష్టిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న షబ్బీర్ అలీ

పాపన్న గౌడ్ సాహసాన్ని, పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి..

కామారెడ్డి : పాపన్నగౌడ్ సాహసాన్ని పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొగులాయి దౌర్జన్యాన్ని ఎదిరించి తెలంగాణ ప్రాంతానికి న్యాయం చేశారని కొనియాడారు. సామాన్య కుటుంబంలో పుట్టి తెలంగాణ ప్రాంతాన్ని కొంత కాలం పాటు పాలించి ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ పాపన్నగౌడ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. గీత కార్మికులు చెట్లు ఎక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీమోపు అనే యంత్రాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గీత కార్మికుల కోసం సేఫ్టీమోపి యంత్రాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, టీఎన్జీవోస్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, సాయిలు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రమేష్ గౌడ్, సంఘాల నాయకులు శివ రాములు, రాజయ్య, మల్లయ్య, గౌడ సంఘాల ప్రతినిధులు మొగుళ్ళ దశ గౌడ్, బాలా అర్జున్ గౌడ్, రాజా గౌడ్, నారా గౌడ్, సాయిరాం గౌడ్, లింగా గౌడ్, వెంకట్‌గౌడ్, రవితేజ గౌడ్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతిలో పాల్గొన్న షబ్బీర్ అలీ..

కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పూలమాలలు వేశారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

22నుండి హనుమకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్

నవ తెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 22నుండి హనుమకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఉంటుందని జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22,23,24 న హనుమకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ సమావేశాల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరుగుతుందని అన్నారు. దేశానికి కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోటే ప్రజాస్వామ్య రాజ్యాంగ రక్షణ సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కే.రాజన్న, వై.రాజిరెడ్డి, భాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

జిజిహెచ్‌లో 5వ రోజు నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

వెస్ట్ బెంగాల్లో నీ కలకత్తాలో మెడికల్ విద్యార్థి పై జరిగిన హత్యాచారం, నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 5వ రోజు ఆందోళన కొనసాగించారు. ఐదవ రోజు కూడా తమ విధులకు హాజరు కాకుండా బైకాట్ చేసి నిరసనలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. ఈ కేసులో ఎంతమంది నిందితులు ఉన్నారో వారందరినీ పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎంతమంది ఉంటే అంత మందిని కఠినంగా శిక్షించాలని అప్పటి వరకు ఈ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జూడో అసోసియేషన్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

చిత్రం... జ్ఞాపకాలు పదిలం



- లిప్తపాటు దృశ్యాలు శాశ్వతంగా బంధించే కళ
- ఆనందాన్నిచ్చేది... హృదయాన్ని కదిలించేది
- చీకటి గది నుండి శాఖోపశాఖలుగా ఎదిగి
- నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ డే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఆకు కదిలితే చిత్రం... చినుకు నవ్వితే చిత్రం... ప్రకృతి పరవశిస్తే చిత్రం.వంద మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రం చెబుతుందంటారు. కళ్లకే కాదు మనసుకు ఆనందాన్నిచ్చేది.. హృదయాన్ని కదిలింపజేసేది ఫోటో మాత్రమే. కాలంతోపాటు ఫోటోగ్రఫీలోనూ ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. సాంకేతికత కొత్తబాటలు పట్టింది.ఒకప్పుడు రీళ్లతో బంధింపబడే ఫోటో.. నేడు చిప్‌లలో బంధింపబడుతుంది.సెల్‌ఫోన్స్ వచ్చాక ఫోటోగ్రఫీ స్వరూపమే మారిపోయింది.అయినా ఫోటోల స్థానం మాత్రం చెక్కు చెదరలేదు. గతమొక జ్ఞాపకం....కానీ జ్ఞాపకాన్ని కలకాలం కళ్ళ ముందే ఉంచే అద్భుత ౦మైన కళ ఫోటోగ్రఫీ.మనిషి కన్ను తెరిస్తే జననం...కన్ను మూస్తే మరణం.ఈ రెండింటి మధ్య భావోద్వేగాల పయనమే జీవితం. ఆ జీవితంలో తీపి,చేదు జ్ఞాపకాలను చిత్రంగా పదిలపరిచే ఫోటోగ్రఫీ మనిషి జీవితంలో అంతర్భాగమైంది. మనిషి తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి మరణించే దాకా మనిషితో మమేకమౌతూ వరణ వర్ణాల బంధాన్ని కొనసాగిస్తుంది. భావాలే అక్షరాలుగా,వాస్తవితే లిపిగా మానవాళి మొత్తం చదువుకోగలిగే భాష కేవలం ఫోటోగ్రఫీకే సొంతం.

మనిషి జీవితంలో మనోఫలకంపై చెరగని జ్ఞాపకాలు అనేకానేకం....కానీ లిప్తపాటు కాలంలో జరిగిపోయి, కాలంలోకి జారిపోయే ఎన్నో, ఎన్నెన్నో జ్ఞాపకాలను ఫోటోగా శాశ్వత పరిచే అద్భుత లలిత కళ ఫోటోగ్రఫీ.. రెప్పపాటు జీవితంలోని సుఖ, దుఃఖాలను దృశ్య కావ్యంగా నిలిపి ఉంచే ఫొటోగ్రఫీ మనిషి పుట్టుకకు ముందే వర్ణ వర్ణాల బంధాన్ని ప్రారంభించి మనిషితో మమేకమై పోతుంది. అభివృద్ధిలో వికాసంలో గొప్పపాత్రను పోషించింది ఫొటోగ్రఫీ కళ.

ప్రకృతి తన అందాన్ని అద్దంలో చూసుకుంటూ మురిసిపోతుంటే ఆ అందాన్ని శాశ్వత చిత్రంగా రూపొందించిన ప్రకృతికి బహుమతిగా అందచేయగలిగే అద్భుతమైన కళే ఫోటోగ్రఫీ. మనిషి తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి జీవనమంతా మనిషితో కలిసి ఉండి జీవితం ముగిశాక కూడా అతని మంచి, చెడుల జ్ఞాపకాలను పదిలపరుస్తూ మనిషి జీవితంతో మమేకమయ్యే కళ ఇది. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నవతెలంగా ప్రత్యేకం

భాషలన్నీ కలిసినా చెప్పలేని భావాలను పలికించే సార్వజనీన భాష... లిప్తపాటులో జరిగే పోయే సందర్భాలను సజీవంగా శాశ్వతపరిచే అద్భుతమైన కళ... జగత్తులో అన్నింటికన్నా అందమైన ప్రకృతి తన అందాన్ని చూసుకోవాలనుకుంటే అద్దంలా నిలిచే రంగు రంగుల మాయ.. అదే ఫోటోగ్రఫీ కళ.చీకటి గదుల్లో ప్రయోగాలతో పుట్టి, చీకటి గదిలో బుడిబుడి నడకలు నడిచి, చీకటి గదిలోనే ఎదిగిన ఫోటోగ్రఫీ... నేడు శాఖోపశాఖలుగా విస్తరించి పరుగులు పెడుతోంది,మధుర జ్ఞాపకాలకు కేరాఫ్‌గా పేరున్న ఫోటోగ్రఫీకి చేదు జ్ఞాపకాలను బంధించే పార్శ్వమూ ఉంది.మనిషి తల్లి



గర్భంలో ఉన్నప్పటి నుంచే మొదల్కొని మనిషి కడదాకా అనుబంధాన్ని కొనసాగించే ఈ కళ... శాస్త్ర సాంకేతిక రంగాల్లో విడదీయరాని భాగమైంది.సమాజ వికాసంలో, శాస్త్రీయ అభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నది.ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధిని కల్పిస్తోంది. కళ.. కళ కోసమే కాకుండా ప్రజల కోసం అనే మాటను సార్థకం చేస్తోంది.జర్నలిజంలో ప్రత్యేక ప్రాముఖ్యతను సాధించింది.

చీకటి గది నుంచి.....

చాల కాలం పాటు ఫోటోకు రూపం తేవడం ఫోటో స్టూడియోల్లో చీకటి గదిలోనే జరిగేది.ఫిలిం డెవలప్‌మెంట్ ప్రక్రియగా సాగింది.ఈ ప్రక్రియ రెండు దశలుగా ఉండేది.మెటల్ హైడ్రోక్వినన్, సోడియం కార్బోనేట్, సోడియం సల్ఫేట్, పొటాషియం, బ్రోమైట్‌తో ఫిలిం డెవలప్ చేసేవారు.రెండో దశలో మెటల్ సల్ఫేట్‌తో ప్రింట్ తీసేవారు.కంప్యూటర్లు, అధునాతన కెమెరాల రాకతో ఫోటోగ్రఫీ చీకటి గదుల నుండి వెలుగుల్లోకి వచ్చేసింది.సెట్టింగుల నుండి సెల్ఫీల వరకు చేరింది.

ఫోటోగ్రఫీ విస్తరణ ....

ఫోటోగ్రఫీ ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగింది.ఇందు గలదు అందు లేదు అన్నట్లు ఎన్నో రంగాలతో మమేకమైపోయింది.ఫ్యాషన్, వైల్డ్ లైఫ్, పిక్టోరియల్, ఏరియల్, అండర్ వాటర్, ఇండస్ట్రీయల్, సైంటిఫిక్, మోడల్, మైక్రో, వెడ్డింగ్, టేబుల్ టాప్, తదితర శాఖలుగా విస్తరించింది. ఓ మాట విటే కొద్దిరోజులకు మర్చిపోతాం. ఓ వాక్యం చదివితే కొన్నాళ్లకు గుర్తుండదు.విషయం ఫోటో రూపంలో ఉంటే ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా మనసులో బాగా నాటుకు పోతుంది.నచ్చిన ఫోటో అయితే చివరి శ్వాసవరకు మనసులో బలంగా నాటుకు పోతుంది.నిత్యం కళ్ల ముందు మెదలుతుంది.అదే ఫోటో గొప్పతనం.మన జీవితకాల జ్ఞాపకాలను భద్రపరిచేవి, కళ్లకు కట్టినట్లు చూపివే ఫోటోలు.కొన్ని చిత్రాలు అంతులేని ఆవేదనను నింపితే.. మరికొన్ని చిత్రాలు తెలియని ఆనందాన్ని ఇస్తాయి.మనిషిలోని విభిన్న కోణాలను ఆవిష్కరించేవే ఫోటోలు.

కాలానుగుణంగా అధునాతన కెమెరాలు....

ఫోటోగ్రఫీ వినియోగం ప్రారంభించినప్పటి నుండి దేశంలో ఎన్నో అధునాతన కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి.దశాబ్దాలు గడిచే కొద్ది రకరకాల కెమెరా డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఫోటోగ్రఫీ ఎంతో అభివృద్ధి చెందింది.గతంలో ఫిల్మ్‌లను ఉపయోగించి ఫోటో లు తీసేవారు. పెద్ద ఫోటోలు కావాలంటే ఫిల్మ్ సహాయంతో ఆర్ట్ వేసి పెద్ద ఫోటోలు తయారు చేసేవారు.

అప్పట్లో బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు మాత్రమే అందుబాటులో ఉండేవి.అనంతరం రీల్ సహాయంతో ఫోటోలు తీసే కెమెరాలు వచ్చాయి.ఈ రీల్‌ను ఉపయోగించి బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు వేసేవారు.అనంతరం కలర్ రీల్స్ మార్కెట్‌లోకి వచ్చాయి.వీటి సహాయంతో కలర్ ఫోటోలు వేయడం ప్రారంభించారు.ఆ తర్వాత రీల్ కెమెరాలకు బదులు డిజిటల్ కెమెరాలు వచ్చాయి.డిజిటల్ కెమెరాల్లో ప్రస్తుతం చిప్‌లను ఉపయోగించి ఫోటోలు తీస్తున్నారు.చిప్‌లతో పాటు హార్డ్‌డిస్క్‌ల్లో కూడా నేరుగా ఫోటోలను బంధిస్తున్నారు.డిజిటల్ యుగం ప్రారంభమైన అనంతరం హెచ్‌డీ, బ్లూరే, 4కే, 5డీ, 6డీ, డ్రోన్ వంటి అత్యాధునిక కెమెరాలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి.వీటిని వాడుతూ ఫోటోగ్రఫీని కొత్తపుంతలు తొక్కిస్తున్నారు.ఫోటోగ్రఫీ అనేక మందికి ఉపాధిగా మారింది.


ఫోటోగ్రఫీ చరిత్ర....

ఫోటోగ్రఫీ మొదట హీలియోగ్రఫీగా ప్రారంభమైంది.15వ శతాబ్దంలోనే బిఫోర్డ్ అనే సాధారణ వ్యక్తి కెమెరా తయారీకి శ్రీకారం చుట్టాడు.16వ శతాబ్దంలో ఫోటోగ్రఫీకి నాంది పడింది.కాష్లర్ అనే శాస్త్రవేత్త తారుపూసిన గుడ్డతో ఫోటో కెమెరా కోసం ప్రయోగాలు చేశాడు..1836లో మొదటి కెమెరా వినియోగంలోకి వచ్చింది.1870లో కాలిఫోర్నియా శాస్త్రవేత్త ష్టాన్ ఫోర్డ్ ఎగిరే గుర్రాన్ని ఫోటో తీశాడు.1882లో జాల్ మారే అనే శాస్త్రవేత్త ఎగిరే పక్షులను ఫోటో తీశాడు.1883లో విలియమ్ జార్జి డెడాలమ్ అనే శాస్త్రవేత్త భూత చక్రంతో కెమెరాను రూపొందించే ప్రయోగం చేశాడు.1889లో డిక్సన్ అనే శాస్త్రవేత్త ప్రకృతి దృశ్యాలను ఫోటోలుగా తీయడం ప్రారంభించారు.18వ శతాబ్దంలోనే ఫ్రాన్స్ దేశానికి చెందిన లూయిస్ డాగూరే ఛాయా చిత్రాలను తయారు చేయడానికి శ్రీకారం చుట్టాడు.రాజ కుటుంబీకుల చిత్రాలు గీసే ఆయన ఎగిరే పావురాలను ఫోటో తీసిన నిప్సేతో కలిసి ఎక్స్‌పోజింగ్ పరికరం రూపొందించే కృషిని ప్రారంభించాడు.మూడేండ్ల పాటు డాగూరే చేసిన కృషితో వచ్చిన కెమెరా అభివృద్ధి నమూనాను హీలియోగ్రఫీగా పిలిచారు.కెమోరాతో ఫ్రాన్స్‌లోని ఓవీధిని తొలి ఫోటో తీశారు.డాగూరే కెమోరా నమూనాను 1839 ఆగస్టు 19న సైన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రాన్స్‌లో ఆరాగే అనే వ్యాపారి వివరించాడు.ఆ రోజు నుండి ప్రతి ఆగస్టు 19న అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

సెల్ ఫోన్లలోనూ అత్యాధునిక కెమెరాలు...

సెల్ ఫోన్లలో కూడా అత్యాధునిక కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి.గతంలో ఎక్కడికి వెళ్లాలన్నా, తీపి జ్ఞాపకాలను ఫోటో రూపంలో బంధించాలన్నా వెంట కెమెరాలు తీసుకెళ్లేవారు.కానీ ప్రస్తుతం అందరూ కెమెరాలకు బదులు సెల్‌ఫోన్లను వెంట తీసుకెళ్తున్నారు.ప్రస్తుతం ప్రతి స్మార్టుఫోన్‌లో కెమెరా సర్వ సాధారణమైంది.పిండి కొద్ది రొట్టె అన్నట్లు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి వచ్చాక సెల్‌ఫోన్ కెమెరాల ఉపయోగం, సామర్థ్యం గణనీయంగా పెరిగింది.ఇవి మల్టీపర్పస్‌గా ఉపయోగ పడుతుండడంతో ప్రతి ఒక్కరూ ఫోటోలు తీయడం ఒక హాబీగా అలవాటు చేసుకున్నారు.

ఫోటోల్లో సెల్ఫీలు ఒక సంచలనంగా మారాయి.ఏ చర్యకైనా సెల్ఫీ, మంచికి సెల్ఫీ, వింతకు సెల్ఫీ, సాహసానికి సెల్ఫీ... ఇలా ఎన్నో కార్యాలకు యువత సెల్ఫీ ఫోటోలను తీయడం ఫ్యాషన్‌గా అలవాటు చేసుకున్నారు.సెల్ఫీ ఫోటోలకు సోషల్ మీడియా వేదికగా మారింది.తాము తీసిన ఫోటోలకు సోషల్ మీడియాలో యువత లైక్‌లను కోరుకుంటూ వచ్చిన లైక్‌లతో ఆనందిస్తున్నారు.సోషల్ మీడియాలో ఫోటోలకు విశేష ప్రాచుర్యం లభించడంతో సెల్‌ఫోన్ ఫోటోలు నేటి యువతకు క్రేజీగా మారింది.





వైద్యురాలిపై అత్యాచారం చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలి



కంఠేశ్వర్: మాట్లాడుతున్న సిఐటీయు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నూర్జహాన్ డిమాండ్



నిజామాబాద్ సిటీ : పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో..



సిరికొండలో...

- సిఐటియు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పశ్చిమ బెంగాల్లో వైద్యురాలిపై అత్యాచారం చేసిన మగాల నుకఠినంగా శిక్షించాలని సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ..పశ్చిమ బెంగాల్లో ఆర్‌జికార్ వైద్య కళాశాలలో జరిగిన అత్యాచార ఘటన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైద్యురాలికి సంబంధించిన అత్యాచార ఘటన కేసు విచారణ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఒక మెట్రోపాలిటన్ నగరంలో ఉన్న వైద్య కళాశాలలో ఇంత పెద్ద ఘటన జరగడం సమాజంలో మహిళలకు రక్షణ లేదనడానికి నిదర్శన మని అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యమే దీనికి కారణం అన్నారు. ఆర్జీ కార్ కళాశాల వైద్యురాలు అత్యాచార ఘటన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని విచారణ వెంటనే పూర్తి చేయాలని జాప్యం జరిగినచో దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని ఆమె అన్నారు. సామూహికంగా అత్యాచారం జరిగినట్టుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది కనుక సిబిఐ వెంటనే దర్యాప్తును పూర్తి చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ చేపట్టాలని అన్నారు. దేశంలో అనేక చోట్ల వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయని అత్యాచార ఘటనలు జరుగుతున్నాయన్నారు. కావున వైద్య సిబ్బందిపై దాడులను నియంత్రించేందుకు సమగ్రమైన చట్టం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో మౌనిక, లక్ష్మి మమత, విజయ, లక్ష్మి, సరిత, రాధిక, దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ (పశ్చిమ బెంగాల్)లో దారుణమైన సామూహిక అత్యాచారం, లేడీ డాక్టర్ హత్యపై జ్యూడిషియల్ ఎంక్వైరీ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిర్వహించాని డిమాండ్ చశారు. కలకత్తాలో మహిళా డాక్టర్ హత్యాచారంను నిరసిస్తూ ఆమెకు నివాళులు అర్పిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బస్టాండ్ నుండి గాంధిచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పిట్ల సరిత మాట్లాడుతూ ఆగస్టు 9న యువ వైద్యురాలిపై సామూహిక అత్యాచారంచేసి హత్య చేయడం దారుణం అన్నారు. రెస్పిరేటరీ డిపార్ట్‌మెంట్‌లో డ్యూటీ చేసే ఆమెపై జరిగిన దారుణమైన దాడికి సంబంధించిన విషయాలు పోస్టుమార్టంలో బయట పడ్డాయన్నారు. ఆమె ముఖం గోడకు వేసి కొట్టి,ఆమె గొంతు నులిమి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ప్రైవేట్ భాగాలను, జననేంద్రియాలను ఛిద్రం చేసిన గాయాలు పోస్టుమార్టం నివేదిక, ఒకరి వల్ల జరిగిన విషయం కాదని తెలియచేస్తున్నప్పటికీ కోల్‌కతా పోలీసులు ఒక వ్యక్తిని మాత్రమే బాధ్యుడిని చేశారని అన్నారు. వాస్తవ విషయాలను బయటకు రాకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ఘటన కేవలం కామవాంఛతో మాత్రమే జరిగింది కాదని, దీని వెనుక ఏదో కుంభకోణానికి సంబంధించిన రహస్యం దాగి ఉందని అన్నారు. అందుకే ఆమెను అమానుషంగా చంపేసారని అన్నారు. ఈ దారుణ ఘటన చూస్తుంటే మహిళలకు స్వాతంత్ర్యం వచ్చినట్లేనా అని ప్రశ్నించారు. ఈ ఘటన మహిళా లోకానికి భయాన్ని కలిగిస్తోందని, వెంటనే సుప్రీం కోర్టు జడ్జి తో విచారణ జరిపి బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సీబీఐకి కేసు అప్పగించిందని, కానీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించేదే సీబీఐ అని అన్నారు. నేరం జరిగిన ప్రదేశంలో సాక్ష్యంలో కొంత భాగం ఇప్పటికే లేకుండా చేశారన్నారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ సమాధానం చెప్పాలని అన్నారు. చట్టాలు, శిక్షలు ఈ దారుణాలు ఆపలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుల్లో కనీసం తప్పు చేశాననే భావన లేకపోవటం అనేది ఉన్మాద లక్షణం అని, అందుకు డ్రగ్స్, మద్యం కారణం తెలిపారు. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నాయని అన్నారు. పనిచేసే చోట, చదువుకొనే చోట మహిళలకు రక్షణ లేకపోవటం దారుణం అన్నారు. ప్రభుత్వాలు ఇకనైనా మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నీలం లక్ష్మి, నగర ప్రధాన కార్యదర్శి జి.సంజన, జిల్లా నాయకురాలు శీలమంతుల స్వప్ననగర ఉపాధ్యక్షులు ఆకుల సభితక్క, నగర కోశాధికారి పొన్ను మానస, నగర నాయకులు సురేఖ, రాజ్యలక్ష్మి పీడీఎస్‌యూ జిల్లా నాయకురాలు దేవిక, ఐఎఫ్‌టీయూ నాయకులు శివకుమార్, పీవైఎల్ నాయకులు జి.రమేష్,వనమాల సత్యం,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితుల దిష్టిబొమ్మ దహనం..

సిరికొండ : కలకత్తాలో వైద్య కళాశాల విద్యార్థినిపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు(ఆదివారం) మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి నిందితుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా మతురాలికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమ, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనిస్, పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆశిష్ మాట్లాడుతూ.. ట్రైని డాక్టర్‌పై పాశవికంగా హింసించి అత్యాచారం చేసి, హత్య చేయడం సిగ్గు చేటని అన్నారు. కేంద్రం ప్రభుత్వం, పచ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం దోషుల్ని పట్టుకొని కఠినంగా శిక్షించాల్సింది పోయి ఒకరిపై ఒకరు నెట్టేసుకోవడం తప్ప మరొకటి చేయడం లేదన్నారు. ఈఘటనను రాజకీయంగా వాడుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందే కానీ భాధితుల పక్షాన నిలబడడం లేదన్నారు. సభ్యసమాజం తలదించుకునేలాగా జరిగిన ఘటనను మానవత్వం ఉన్న ప్రతిఒక్కరు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వహించడం శోచనీయమని అన్నారు. ఇంత జరుగుతున్న యాజమాన్యంకు తెలియదు అన్నట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. తక్షణమే కేంద్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రమాని నిందితులను కఠినంగా శిక్షించాలి అని, భాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడగా పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు జమున, డివిజన్ నాయకురాలు మానస, మండల నాయకులు మల్కిలత, లతిక, ఐనాలా లక్ష్మిప్రమీల, . స్వరూప, తస్లిన్ బేగం, పీడీఎస్‌యూ నాయకులు ప్రేమ్ కుమార్, .రుషివర్ధన్, బిట్టు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్, మండల నాయకులు దామోదర్, . బాబన్న, సాయరెడ్డి, లింబాద్రి, కిషోర్,ఎర్రన్న ఐనాలా రాజన్న, బట్టు. సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వెంకట్ గౌడ్

ఆర్మూర్ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వెంకట్ గౌడ్ ఆదివారం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపతంగా విచారణ చేయాలని,, ప్రజారోగ్యాన్ని కాపాడే వైద్యులపై ఇలాంటి ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని అన్నారు. ఇలాంటి ఘటనాలు పునరావతం కాకుండా చట్టాలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్సీని కలిసిన తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు


ఎమ్మెల్సీని కలిసిన జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా తరపున కలిసినట్టు జిల్లా అధ్యక్షుడు కుమ్మల లక్ష్మణ్ యాదవ్ అన్నారు. తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి సన్మానించారు. రాబోయే రోజుల్లో కోదండరాం మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

దీండి మహెూత్సవ మహాపాద యాత్ర


పాదయాత్రగాలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని లాడేగం గ్రామ నుంచి శ్రీ క్షేత్రం రామేశ్వరం గుట్టకు మారుతి మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలు పురుషులు భక్తులు పాదయాత్ర మండల కేంద్రం గుండా సాగింది. మండలంలోని బేగంపూర్ గ్రామ చౌరస్తా వద్ద హనుమాన్ గుడి వద్ద భక్తులకు ఉప్పరి అంజయ్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ దీండి సాయంత్రం వరకు గుట్టకు చేరుకొని రాత్రికి భజన కార్యక్రమం నిర్వాహస్తామని అన్నారు.


పిట్లం: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు


సదాశివనగర్‌లో...


లింగంపేట్‌లో...

ధీరత్వానికి ప్రతీక.. పాపన్నగౌడ్

- ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి
- చిత్రపటానికి నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ధీరత్వానికి ప్రతీక.. సర్వాయి పాపన్న గౌడ్ అని పలువురు వక్తలు కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.

బోధన్ : తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతికగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్ అన్నారు. సాలూర మండల కేంద్రంలో సాలూర గీత కార్మికసంఘం ఆధ్వర్యంలో 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపుమండి కత్తి పట్టిన వీరుడని కొనియాడారు. దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడని గుర్తుచేశారు. రఘునాథపల్లి మండం ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొఘలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగుర వేసిన మహనీయుడు అతడే బహుజన వీరుడు సర్వాయి పాపన్న అని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దళితులు, బహుజనులు ఐక్యంగా పోరాడి రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ జనార్దన్, మాజీ ఎంపీపీ గోవిందగౌడ్, స్వామిగౌడ్, అల్లె రమేష్, షకీల్, ఖదీర్, పాండు, సంజీవ్, అశోక్‌గౌడ్, రాజాగౌడ్, రంజిత్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, రఘుగౌడ్, మొగులగౌడ్, మహేష్‌గౌడ్, స్వామిగౌడ్, సాయగౌడ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంలోని చాచా నెహ్రూ విగ్రహం వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం సలిపిన యోధుడని, మొగులాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతం కోసం అహర్నిశలు కృషిచేసిన వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు సాయగౌడ్, సభ్యులు రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్ గౌడ్, దత్త గౌడ్, బాబా గౌడ్, రవి గౌడ్, జ్యోతి గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గౌడసంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భరతమాత ముద్దు బిడ్డ చక్రవర్తి సర్దార్ పాపన్న అని కొనియాడారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ఎండ్రియాల సాయగౌడ్, మాజీ ఉపసర్పంచ్ గంగాధర్‌గౌడ్, రవిగౌడ్, నరేందర్‌గౌడ్, భరత్ గౌడ్, రాజేందర్ గౌడ్, చిన్న స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : తెలంగాణ పోరాట వీరుడు బహుజనుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలోని ఐలాపూర్, లింగంపేట్ గ్రామంలో గీతా కార్మికులు గౌడ కులస్తులు కాంగ్రెస్ నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, దొరలలో జాగిదారులను జమీందారులను ఎదిరించి బహుజనులను విముక్తి చేసిన మహనీయుడు అని తెలిపారు. ఆయన త్యాగఫలమే నేడు ప్రజల స్వేచ్ఛగా ఉంటున్నారని ఆయన చేసిన సేవలను కొనియాడరు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, రవిగౌడ్, వంజరి ఎల్లమయ్య, దురిశెట్టి అశోక్, డాక్టర్ రాజు, ఫతియోద్దీన్, గులాం, రఫీక్, గౌడ సంఘం సభ్యులు ప్రసాద్‌గౌడ్, మనోహర్‌గౌడ్, రామలింగగౌడ్, బుజ్జాగౌడ్, సిద్ధగౌడ్, బైరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని బాగేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మాగంటి సురేందర్ గౌడ్, గౌడ సంఘం మండలాధ్యక్షులు సాయిబాబాగౌడ్ సమక్షంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గాంధీ విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయాగౌడ్, రంజిత్‌గౌడ్, గవాస్కర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 జయంతి వేడుకలను మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కళాలి యాదగిరి గౌడ్, నాయకులు రామాగౌడ్, లచ్చగౌడ్, వంశీగౌడ్, నారాగౌడ్, సంతోష్ గౌడ్, మచ్చేందర్‌గౌడ్, సాయగౌడ్, మహేందర్‌గౌడ్, బాలాగౌడ్, సురేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘం అధ్యక్షులు రాజానర్స్ గౌడ్, గౌడ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కులు, అభివృద్ధి కోసం పోరాటం చేశారాని, ప్రతి ఒక్కరు ఆయన ఆశయం సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు నాగభూషణం గౌడ్, ప్రసాద్ గౌడ్, సుదర్శనం గౌడ్, శామ్‌గౌడ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ మండలంలోని హన్మజీపేట్ గ్రామ మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబెర్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ ఎస్సీ కాలనీలో ఓబీసీ రెంజల్ మండల అధ్యక్షులు లచ్చేవార్ నితిన్ రూ.7,50,000 నిధులతో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాటాపూర్ గ్రామ అభివృద్ధి కోసం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామకృష్ణారెడ్డి, రైతు నాయకులు చంద్రశేఖర్, మాజీ మండల అధ్యక్షులు జి.సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, కురుమే సాయిలు, గంగాధర్, రాకేష్, కార్తిక్ యాదవ్, భూమన్న, గోపికృష్ణ, ప్రేమ్‌కుమార్, గుర్రాల సంతోష్, ఎస్సీ కమ్యూనిటీ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు లాండె భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇందూరి సిద్దాగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వం పెద్దపీట వేయాలని అన్నారు. జర్నలిస్టులపై పెరుగుతున్న ఒత్తిడిలను అధిగమించేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రతి ఒక్క జర్నలిస్ట్‌కు ప్రాధాన్యత కల్పించే విధంగా సహాయ సహకారాలు అందించనున్నట్టు వివరించారు. నూతనంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ముద్ర కోలా నర్సింలును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా డి.కృష్ణారావు, ఆర్.రామ్మూర్తి, కె.హరీష్, ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా అఖిల్‌రెడ్డి, కోశాధికారిగా నీల వెంకటి, ముఖ్య సలహాదారులుగా ఎం.సాయిలు, జె.శ్రీనివాస్, ఎస్.మురళి, జి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ అబ్రబోయిన శ్రీను, శ్రీకాంత్‌గౌడ్, రాజు, ఆశన్న, వెంకటేష్ కుమార్, సుమారు 40 మంది అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ప్రభుత్వ సలహాదారుడికి సన్మానం


ప్రభుత్వ సలహాదారుడిని సన్మానిస్తున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం సభ్యులు సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి వారికి శాలువాతో సన్మానించారు. రైతు రుణమాఫీ చేసి మొదటిసారి కామారెడ్డికి విచ్చేసినందుకు అభినందనలు తెలిపారు. రైతు రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, రైతుల తరపున కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు గంధ్ర నరసింహులు, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పోతుల చిన్న భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై విజయ్ కొండాకు సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్, డోంగ్లి మండలాలకు నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయ్ కొండను డోంగ్లి మండలంలోని మల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృత్ వార్ శ్రీకాంత్, మారేపల్లి గ్రామానికి చెందిన మమ్మద్ ఈసా విలాస్ తదితరులు కలిసి ఆదివారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోలీసుల దగ్గరకు వచ్చే ప్రజలకు న్యాయంగా పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సత్కరించిన కాంగ్రెస్ నాయకులకు నూతన ఎస్సై అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీటీసీ నిధులతో బోరుబావి తవ్వకం


బోరు పనులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామంలో బోరు వేయించినట్లు ఆదివారం తాజా మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని ఇటీవల స్థానిక ఎంపీటీసీ సంతోష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీటీసీ నిధులతో శనివారం నాడు రాత్రి గ్రామంలోని జిపి భవనం సమీపంలో బోరు వేయించారని, బోర్ బావిలో నీరు పుష్కలంగా వచ్చాయని అన్నారు. వెంటనే 24 గంటలు గడవకముందే బోరు మోటారు పంపు బిగించి నీటిని సరఫరా చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ కృషితో గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందని పలువురు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపి సిబ్బంది, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మెడికో విద్యార్థిని హత్య పట్ల ఖండన

- నిందితున్ని బహిరంగంగా ఉరితీయాలి
- టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కృష్ణమాచారి

నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్


బోధన్ : దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న మహిళలు

కలకత్తాలో మెడికో విద్యార్థినిని రేప్ చేసి హత్య చేసిన ఘటనను టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కృష్ణమాచారి మాట్లాడుతూ.. మెడికల్ పీజీ ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థిని సెమినార్ హాల్‌లో నిద్రిస్తుండగా ఆమెను రేప్ చేసి హత్య చేసిన నిందితుడిని పట్టుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, వెంటనే ప్రభుత్వం నిందితుని పట్టుకొని బహిరంగంగా ఉరితీయాలన్నారు. దేశంలో రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని అలాంటివి జరగకుండా ఉండాలంటే ఈ నేరాలకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షలు అమలు చేసినప్పుడే మహిళలపై అత్యాచారాలు తగ్గుతాయన్నారు. మనదేశంలో ప్రత్యక్ష దైవాలుగా భావించే వైద్యుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రవీణ్‌గౌడ్, టి.సాయిలు, కరుణాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీ.జీ డాక్టర్‌ను హత్య చేసిన కామంధులను కఠినంగా శిక్షించాలి..

బోధన్ : పశ్చిమ బెంగాల్‌లో పీ.జీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో కామాంధుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్‌లో ఈనెల 8వ తేదీన పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమితపై కొంతమంది కామంధులు సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారని ఆ ఘటనపైన విచారణ చేసి, దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగి పది రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వారిని గుర్తించి, శిక్షించకపోవడం సిగ్గుచేటని అన్నారు. నేడు దేశంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, మహిళలపై నిత్యం ఎన్నో ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ఘటనలపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవని, కోర్టుల దాకా వెళ్లి శిక్షలు పడితే కూడా అధికారంలో ఉన్న వారి అండదండలతో శిక్షలను కూడా రద్దు చేస్తున్నారని నేరస్తులకు దోషులకు వత్తాసు పలికే వారే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్లో 8వ తేదీన జరిగిన పీజీ డాక్టర్ మౌమితపై అత్యాచారం, హత్యచేసిన దుర్మార్గులను ఇప్పటికైనా అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. పిఓడబ్ల్యూ బోధన్ పట్టణ నాయకులు అరుణ, యాదమ్మ, గంగామణి, లక్ష్మి, మనెమ్మ సావిత్రి, పిడిఎస్‌యు నాయకురాలు మౌనిక, ఏఐపికేఎస్ జిల్లా నాయకులు పడాల శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : టిపిటిఎఫ్ అధ్యక్షులు వై.సత్యనారాయణ అధ్యక్షతన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశన్ని ఆదివారం వశిష్ఠ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అనిల్ కుమార్ మాట్లాడుతూ కలకత్తాలో మెడికోను అత్యాచారం చేసి దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. సోమ, మంగళ వారాల్లో నిరసన ప్రదర్శనలకు జిల్లా కమిటీ పిలుపునిచ్చిందన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మెబాట

- ఆరోగ్య మిత్రుల డిపిఓ క్యాడర్‌ను తక్షణమే కల్పించాలి

నవతెలంగాణ-కామారెడ్డి


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య మిత్ర సమ్మె పిలుపులో భాగంగా కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ఆరోగ్యమిత్రాల తమ సమస్యలపై సమ్మె నోటీసును ఆదివారం అందజేసినట్టు రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. ముఖ్యంగా లిఫ్ట్ ఆపరేటర్ కేడర్ నుండి డిపిఓ క్యాడర్‌గా చేంజ్ చేయాలనీ, అదే విధంగా ఉద్యోగ భద్రత కల్పించి వేతన సవరణ చట్టం 60జిఓ ప్రకారం కనీసం 22,750 జీతం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేకు ఆరోగ్య మిత్రలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి ఆరోగ్యమిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వివరించారు. ఆరోగ్య మిత్రలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వివరించారు. సమస్యలను పరిష్కరించకపోవడంతో తప్పని పరిస్థితిలో ఈనెల 20 నుండి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సమ్మె బాట పడతామని ఆరోగ్యమిత్రలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గంగాధర్, అనిల్, నిర్మల, నరసవ్వ, మహేష్, కృష్ణ వర్ధన్, శివాజీ, సంతోష్, సాయిబాబా, జనని రాణి, కాశమని, సురేఖ, క్రాంతి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | ఆగస్టు 19, 2024 | www.navatelangana.com

జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాస్థాయి అండర్ -1, బాల, బాలికల చెస్ టోర్నమెంట్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నగర్ లోని అభ్యాస పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా విక్టరీ హైస్కూల్ కరస్పాండెంట్ రామ్ చంద్రరావు హాజరై క్రీడాకారులకు ట్రోఫీలు పోటీలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంస పత్రములు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి రమేష్, నవ్య కృష్ణ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో బి.అభిజిత్ (అభ్యాస పాఠశాల)మొదటి స్థానం, అంతర్వు తర్వే (ప్రే సిడెన్సి పాఠశాల) బాలికల విభాగంలో నాగ జ్యూస్నికా (అబ్యాస పాఠశాల)మొదటి స్థానం, సహస్ర రాథోడ్ (ప్రే సిడెన్సి హై స్కూల్) ద్వితీయ స్థానం సాధించారు.

డిసిఎం బస్సుఢీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- సడన్ బ్రేకు వేయడంతోనే ..



నవతెలంగాణ-ఆర్మూర్

నిర్మల్ నుండి నిజామాబాద్ వైపు వెళుతున్న టిఎస్ఆర్టిసి జిల్లా 2 డిపో బస్సు, డీసీఎంలు ఢీకొన్న ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కుక్కను తప్పించే క్రమంలో చిన్నాపూర్ గ్రామ జాతీయ రహదారిపై డీసీఎం డ్రైవర్ బ్రేకు వేయడంతో వెనక వస్తున్న బస్సు డ్రైవర్ బ్రేకు వేయగా వేగం అదుపు కాక బస్సు ముందర అద్దాలు ధ్వంసం అయ్యాయి. దీంతో బస్సులోని ప్రయాణికు లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డ్రైనేజీలో పసికందు మృతదేహం లభ్యం


డ్రైనేజీలో పసికందు మృతదేహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని డ్రైనేజీలో అప్పుడే పుట్టిన పసికందు మృతదేహం లభించిన సంఘటన అదివారం మధ్యాహ్నం వెలుగు చూసింది. నిజామాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం పక్కన ఉన్న డ్రైనేజీలో నవ జాత శిశువు ను పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. స్థానిక పోలిస్ లకు సమాచారం అందించడంతో పసికందు మృతదేహంను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

రైలు కిందపడి ఒకరి మృతి


మృతి చెందిన బాలాజీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద ప్రమాదవశాత్తు పడి బాలాజీ (33) మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయి రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ లోని ఆటోనగర్ కు చెందిన బాలాజీ తన చెల్లెలు పూజతో కలిసి పర్భని ప్యాసింజర్‌లో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు కింద పడగా తీవ్ర గాయాలు కావడంతో గమనించిన లోకో పైలట్ రైలును ఆపి క్షతగాత్రున్ని బాసరకు తీసుకొనివెళ్లారు. 108 అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా మృతి చెందాడని నిర్ధారించడంతో రైల్వే ఎస్సై సాయి రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్‌హెచ్‌ఓ మహేష్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అగస్టు 15 నుంచి నిజామాబాద్ పోలిస్ కమీషనరేట్ పరిధిలో తప్పని సరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మేట్ ధరించాలనే నిబంధన అమలు లో బాగంగా ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్రజలు, యువకులు, వాహన దారులు అవగాహన కలిగి ఉండాలని డిచ్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ మహేష్ అన్నారు. అదివారం డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొరట్‌పల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్‌హెచ్‌ఓ మహేష్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ వంతుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని అన్నారు. మైనర్ లకు వాహనాలను నడపనివ్వకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల దన్నారు. మైనర్‌లకు ద్విచక్ర వాహనాలను ఇచ్చినట్లయితే దానికి బాధ్యత తల్లిదండ్రులదే ఉంటుందని, ఇదేకాకుండా శిక్ష,20వేల రూపాయల జరిమానా ఉంటుందని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరగకుండా ఆపవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్షకూడా విధించడం జరుగుతుందని, పిల్లలను చెడు వ్యసనాల బారిన పడకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొందెం చెరువు అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బోందెం చెరువు అక్రమణకు పాల్పడిన అధికారులపై, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బి. భాస్కర్ అన్నారు. నగర నడిబొడ్డున అక్రమణలు కొనసాగుతుంటే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఏమి చేశారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ లో జరుగుతున్న అవినీతి ఈ మధ్య కాలంలో ఏసీబీకి పట్టుబడ్డ అధికారి దగ్గర లభ్యమైన డబ్బులు చూస్తేనే అర్థం అవుతుందన్నారు. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూములు అక్రమణకు గురవుతున్నాయని అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. బోందెం చెరువు అక్రమణల తోలగింపులో నష్ట పోయిన నిరుపేదలను ఆదుకోని. అక్రమణలను ప్రోత్సహించి సామాన్యులను బలిపశువులను చేసిన అధికారులపై, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్యూచర్ లైన్ పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలు



రాఖీ కడుతున్న విద్యార్థినిలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో రాఖీ నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ప్రియాంక, స్వప్న మాట్లాడుతూ రాఖీ పండుగ అనేది అన్న - చెల్లెళ్లు, తమ్ముడు - అక్క మధ్య బంధాన్ని గుర్తు తెచ్చుకుంటూ జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు లత, సుమలత, శ్రీలత , గౌతమి , సంధ్య, జమున, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అరికట్టొచ్చు

- ఎస్‌హెచ్‌ఓ విజయ్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాంగోపాల్ స్ట్రీట్ జై భవాని టిఫిన్ సెంటర్ పక్కనే ఉన్న మల్గిలో సిసి కెమెరాలను 1 టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని దుకాణదారులు, వ్యాపారులందరి సహకారంతో దాదాపుగా 2.5 లక్షలతో 21 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ విజయ్ బాబు మాట్లడుతూ.. ఒక సిసి కెమెరా 100 పోలీసులతో సమానమన్నారు. నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. నేరస్తులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. తమకాలనీల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిసి కెమెరాల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన జుగల్ కిషోర్ పాండే ను ఎస్ హెచ్ ఓ అభినందించారు. కార్యక్రమంలో రమేష్ మాలు, పెంటయ్య సేఠ్,సురేష్ సేఠ్, వినోద్ పాండే గోవింద్ పరేఖ్, అనిల్ దయమా, జగదీష్ మాలు, భగవాన్ ఉపాధ్యాయ, ఉదయ్ ఉపాధ్యాయ్, పంకజ్ సేథియా, నితిన్ పాండే, పవన్ సోని తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ

- నేడు రాఖీ పౌర్ణమి

నవతెలంగాణ-ఆర్మూర్

సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే రాఖీ పౌర్ణమిని ప్రజలు చిన్న పెద్ద తేడా లేకుండా ఘనంగా జరుపుకుంటారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రేమనురాగాలకు ప్రతీక ఈ రాఖీ పండుగ. సోదరులు అక్క చెల్లెలతో రాఖీ కట్టించుకుని వారికి కట్న కానుకలను అందజేయడం ఆనవాయతీ. నేడు రాఖీ పౌర్ణిమ సందర్భంగా నవ తెలంగాణ కథనం..

అలెగ్జాండర్ ప్రాణం నిలిపిన బంధన్...

అఖండ భారతావని తక్షశిల మహారాజు పురుషోత్తముని చేతుల్లో ఓటమిపాలైన అలెగ్జాండర్ ప్రాణాలు కాపాడడానికి ఆయన భార్య రుక్సోనా రక్షాబంధన్ వినియోగించుకున్నట్లు చరిత్రకారులు చెబుతారు.. పురుషోత్తముడిని తన సోదరునిగా భావించిన రుక్సోనా రాఖీ కట్టి యుద్ధంలో ఓడిన భర్త ప్రాణాలు కాపాడుకుంటుంది.

ఎంతదూరమైనా రాఖీ కంట్టేందుకు..

తోడబుట్టిన బంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎంత దూరాన ఉన్న తన అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు వస్తారు.. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే రాఖి పర్వదినాన్ని రాఖి పౌర్ణమిగా పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. బీహార్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో కజరి పూర్ణిమ, కేరళ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలలో అవన్నీ అవిటం అని పిలుస్తారు.

నాటి నుంచి.. నేటి హైటెక్ యుగంలో..



పూర్వం రాఖీలను బ్రహ్మరాశి తాడుతో పేనిన నూలుపోగు రాఖీలను కట్టుకునే వారు.. నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లలను పెద్దలను ఆకర్షించేలా రాఖీలు తయారు చేస్తున్నారు. నేటి హైటెక్ యుగంలో మనుషుల మధ్య దూరం పెరిగిన అనుబంధాల మధ్య దూరం పెరగలేదని చెప్పవచ్చు.. ఎందుకంటే రాఖీలను ఆన్లైన్లో పంపించే వెసులుబాటు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లోకి వెళ్ళని వారు సైతం ఆన్లైన్లో తమ సోదరులకు రాఖీలు పంపుతున్నారు.

ఎల్లలు దాటిన బంధం...

రాఖీ పండగ నేపథ్యంలో ఆత్మీయత అనుబంధాలకు ఎల్లలు లేవు.. గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి జిల్లాలోని ఈ ప్రాంత కార్మికులు రాఖీ పండగ జరుపుకుంటారు. గల్ఫ్‌కు వెళ్లిన కార్మికులకు తమ స్వస్థలాల నుంచి అక్క చెల్లెలు పండుగకు కొన్ని రోజుల ముందే రాఖీలు పోస్టు ద్వారా కొరియర్ ద్వారా పంపుతున్నారు. దుబాయ్, బెహరాన్, కువైట్ ,సౌదీ అరేబియా, ఒమాన్, దోహా కత్తర్, ఇరాక్ తదితర దేశాల్లో తెలుగు కార్మికులు తాము నివసించి గల్ఫ్ దేశాల్లో రాఖీ పండగ జరుపుకుంటారు.

పెరిగిన ధరలతో....

ఉమ్మడి జిల్లాలతోపాటు పట్టణ కేంద్రంలో, వివిధ గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ముంబాయి, బెంగుళూరు, గుజరాత్ ,హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన రాఖీలను చిరు వ్యాపారులు అమ్ముతున్నారు. దుకాణాల ముందు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేసి మరి విక్రయిస్తున్నారు.. 5 రూపాయలు మొదలుకొని 500 వరకు రాఖీల ధర పలుకుతున్నాయి. ప్రతి సంవత్సరం పండుగకు మూడు నాలుగు రోజుల నుండి రాఖీలను అమ్ముతున్నారు. గతంలో పోలిస్తే రాఖీల ధరలు విపరీతంగా పెరిగాయని దుకాణదారులు వాపోతున్నారు.

ఆత్మీయతను పంచే పండగ....



ప్రతి సంవత్సరం రాఖీ పండగ వస్తుందంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం ఈ పండగ ద్వారా మరింత బలపడుతుంది. తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటాం..

ఆది శ్రీనివాస్ పటేల్, వైద్యులు, ఆర్మూర్.

మమతానురాగాలకు గుర్తు రాఖీ పండగ



అన్నా చెల్లెళ్ల ఆత్మీయ పండగ రక్షాబంధన్. సోదరుని ఉన్నతిని కోరుకుంటూ కట్టే రాఖి శుభాలు కలగజేస్తాయని విశ్వాసం. మమతానురాగాల ఆత్మీయ పండుగ రక్షాబంధన్.

బి, తేజస్వి, వైద్యురాలు ,ఆర్మూర్.

కూల్చివేసిన ఇండ్ల బాధితుల ఆందోళన

- తమకు న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర శివారులోని బొందం గడ్డ శిఖం భూమి కబ్జా వెనుక కీలక విషయాలు వెలుగులోకి రాగా పలువురు స్థానిక నేతలు నకిలీ పట్టాలు సృష్టించి పేదలకు వాటిని విక్రయించినట్లు తెలుస్తుంది. వంద గజాల ప్లాటుకు రూ.2 లక్షల వరకు సదరు వ్యక్తులకు ముట్టజెప్పినట్లు బాధితులు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం బొందం గడ్డ చెరువు శిఖం భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా బాధితులు తమ కుటుంబాలతో కలిసి ఆదివారం నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అనంతరం ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులతో కలిసి తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 9, 10, 11 డివిజన్లకు చెందిన శేఖర్, నరేశ్, మహమ్మద్, హైమద్లతో పాటు పలువురు స్థానికంగా ఖాళీగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వాటికి పట్టాలు సృష్టించారు. అనంతరం పేదలకు వాటిని రూ. లక్షన్నర నుంచి రూ.2 లక్షల చొప్పున విక్రయించారు. పట్టాల ద్వారా నగరపాలక సంస్థ నుంచి ఇంటినంబర్లు పొందిన పలువురు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ నుంచి మీటర్ పర్మిషన్లు కూడా తీసుకున్నారు. కాగా బొందం గడ్డ చెరువును సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో శిఖం భూమి కబ్జా అవుతోందని రెవెన్యూ అధికారులు ఇటీవల గుర్తించారు. సర్వే నిర్వహించి పెద్దమొత్తంలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఈ క్రమంలోనే శనివారం సంబంధిత అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. కాగా బాధితులు అసలు విషయాలు బయటకు వెల్లడించడం నగరంలో చర్చకు దారితీసింది. పలువురు స్థానిక ప్రజాప్రతినిధుల భర్తలు ప్రభుత్వ స్థలాలపై కన్నేసి వాటిని అడ్డదారిలో విక్రయించి తమను మోసగించినట్లు బాధితులు పేర్కొంటున్నారు. వీరిలో ఇద్దరు బీఆర్ఎస్ నేతలు కాగా మరో ఇద్దరు కాంగ్రెస్‌కు చెందిన నేతలున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి. మరోవైపు బాధితులు మాట్లాడుతూ.. భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా తమ ఇళ్లను కూల్చడం సరికాదని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఎంఐఎం కార్పొరేటర్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలియజేశారు.


ఆందోళన చేస్తున్న బాధితులు

చెరువులో వ్యర్థాలు వేయవద్దని హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కుడు గుంట చెరువులో వ్యర్థాలు వేయద్దని సూచిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు ఎవరు కూడా పాత బట్టలు, ఇండ్లలో ఫంక్షన్లు అయితే ఇస్తారాకులు, మిగిలిపోయిన అన్నం, కూరలు చెరువులో పాడైయొద్దని సూచిస్తూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలందరికీ తాగునీరు అందించే చెరువు కాబట్టి గ్రామ అభివృద్ధి కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి తెలిపారు. ఎవరైనా చెరువులో వ్యర్థాలు వేసినప్పుడు చూసి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు సమాచారం ఇస్తే తగిన బహుమతి అందజేస్తామని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు చెరువు కట్ట సమీపంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, సున్నం మోహన్, పెంట కిషన్, నూకల బుచ్చి మల్లయ్య, కండక్టర్ రవి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాటిచ్చాం..రుణమాఫీ చేస్తున్నాం..

- టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్
- పదేళ్ల పాలనలో 1200 మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడు కేసీఆర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇచ్చిన మాటప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులను నిట్ట నిలువుగా ముంచి పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, వరేస్తే ఉరి అన్న కేసీఆర్ 1200 పైగా రైతుల ఆత్మహత్యలకు కారకుడని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతు ద్రోహులన్నారు. ఏకకాలంలో రూ. లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పింది మీరు కాదా.. అని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. ఏం మొహం పెట్టు పెట్టుకొని ధర్నాలు చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులను తప్పుదారి పట్టిస్తున్న ప్రశాంత్ రెడ్డిని, బీఆర్ఎస్ పార్టీని రైతాంగం నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నాం.. చేస్తున్నాం. ఇప్పటివరకు 22, 37,848 లక్షలకు పైగా రైతులకు రైతు రుణమాఫీ జరిగిందన్నారు. మొత్తము రూ.31వేల కోట్లు రైతు రుణమాఫీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిదులు కేటాయించిందని తెలిపారు. విడితల వారీగా వ్యవసాయ రుణాలు తీసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షలు మాఫీ అవుతుందన్నారు. ఈ ఖరీఫ్ లో ఇచ్చిన మాట ప్రకారం క్వింటాల్ కు రూ. 5వందల బోనస్ కూడా ఇవ్వబోతున్నట్లు స్పష్టంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఒకపక్క ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంటే.. మరోపక్క రైతులకు రుణమాఫీ జరగట్లేదు రైతులను మోసం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ప్రతి ఒక్కరికి రైతు రుణమాఫీ చేసి తీరుతుంది అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల తప్పుడు మాటలు విని ప్రజలు, రైతులు మోసపోవద్దని సూచించారు. సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగేలా ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి తక్కురి దేవేందర్, మండల కార్యదర్శి గోపీడీ లింగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుంకేట బుచ్చన్న, పాలేపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, బుచ్చి మల్లయ్య, కొమ్ముల రవీందర్, పూజారి శేఖర్, ఏనుగు మనోహర్, పెద్ది సృజన్, గణేష్, అజార్, మణికంఠ, మారయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పట్టణంలో స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

జర్నలిస్ట్ కాలనీ లోఆదివారం నిర్వహించే స్వచ్ఛ కాలనీ సమైఖ్య కాలనీ ఆదివారంతో 58 వ వారానికి చేరుకుంది ఇందులో భాగంగా రోడ్డు నంబర్ 5 నందు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి గడ్డిని తీసి వేసి మురికి కాలువలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను, కాలువలో ఉన్న మట్టిని తొలగించి శుభ్రం చేసినం ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ కాలోనిలోకి గత కొన్ని రోజులుగా చెత్త సేకరించే వాహనం రావడం లేదని వచ్చిన ఉదయం సరియైన సమయానికి వస్తలేదని మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కొక్కెర భూమన్న కొంతం రాజు, ఎల్ టి కుమార్, ఎర్ర భూమయ్య, గడ్డం శంకర్, గణేష్, జీవన్, రవి, నల్ల సాయన్న పుతాడి ఎల్లయ్య, కుంట గంగారెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్

నవతెలంగాణ-ఆర్మూర్

కలకత్తావైద్య కళాశాల విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, డివిజన్. కార్యదర్శి దేవారం డిమాండ్. చేశారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా. కార్యాలయం. కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ మౌమిత, కలకత్తా నడిబొడ్డున గల అర్జికర్ ఆసుపత్రిలో రాత్రి రెండు గంటల వరకు డ్యూటీ చేసి.. విశ్రాంతి తీసుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో కాన్ఫరెన్స్ హాల్లో నిద్రించడానికి వెళ్ళిందన్నారు. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ చెందిన కొందరు, అధికారుల కుటుంబాలకు, చెందిన కొందరు దాడి చేసి సామూహికంగా అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటన మానవ సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడితో ఈ ఘటనను తారుమారు చేయడానికి మసిబూసి మారేడుకాయ చేయడానికి కాలేజీ నిర్వహకులు మొదట మౌనిత కుటుంబానికి ఆత్మహత్యగా చిత్రీకరించ ప్రయత్నించిందని, ఇందులో కుట్ర దాగి ఉందని అన్నారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన కొన్ని గంటల్లోనే సుమారు 40 మంది గుండాలు హాస్పటల్‌పై దాడి చేసి సాక్ష్యాలను దొరకకుండా చేసే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో సుమారుగా వెయ్యి జరిగిగాయని అధికార లెక్కలే చెబుతున్నాయని తెలిపారు. మోడీ బేటి బచావో.. భేటీకి పడావో నినాదం ఎక్కడికి పోయిందని ఎద్దేవా చేశారు. ఈ ఘటనలు జరగడానికి ప్రధానంగా డ్రగ్స్ మాఫియా, విచ్చలవిడి మద్యం అమ్మకాలు, అశ్లీల చిత్రాల ప్రదర్శనలు.. యూట్యూబ్ తదితర సోషల్ మీడియాలో యువతరానికి అందరికీ అందుబాటులో ఉండడమే ఒక కారణమని అన్నారు. ఈ ఘటనపై రాజకీయాలు చేయడం మానేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తి చే న్యాయ విచారణ చేయించి, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి నేరస్తులకు కఠినమైన శిక్ష పడే విధంగా చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

పశ్చిమబెంగాల్ పోలీసులు ఇప్పటికి కూడా వాస్తవాలను, ఖననం చేసి ఒక్కరే అత్యాచారానికి పాల్పడ్డారని మాట్లాడడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్ లో 150 మిల్లి గ్రాముల వీర్యం ఉందని ఒకవైపు వైద్యులు నిర్ధారిస్తుంటే పోలీసులు బరితెగించి దోషుల్ని రక్షించే ప్రయత్నం చేయడం సభ్యసమాజం సిగ్గుపడుతుందని అన్నారు.

దుండగులినికఠినంగా శిక్షించేది పోయి రాజకీయ లబ్ధి కొరకు ముఖ్యమంత్రి గారు మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటు అన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యానికి, దోషులకు సహాయపడే విధంగా ఈ చర్యలు ఉన్నాయని, అన్నారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తున్న డాక్టర్లకు, ఐఎంఏకు సిపిఐ ఎంఎల్ ప్రజా పంతా మాస్ లైన్ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఐక్య ఉద్యమాన్ని నిర్మిద్దాం అని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు, ముత్తెన్న, మండల సంయుక్త కార్యదర్శి, కిషన్, శేఖర్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

తొర్తిలో పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ సభ్యులు మాట్లాడుతూ... బహుజన పోరాట యోధుడు పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల చిన్న గంగారాం,మాజీ సర్పంచ్ కుండ నవీన్, తుపాకుల నారాగౌడ్, సుమన్, రవి, గోవర్ధన్, రాజా గౌడ్, నాయుడు నాగన్న, కొత్త రాజన్న, కుండ సాగర్ పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహఆవిష్కరణలో పాల్గొన్న గౌడసంఘ సభ్యులు

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని గ్రామ పోలిమేరలో గల బారెడు పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బారెడు పోచమ్మ అమ్మవారికి తీపి వంటకాల నైవేద్యంతో పాటు సారే సమర్పించారు. కాగా పాత గ్రామపంచాయతీ (చావిడి) నుండి బారెడు పోచమ్మ ఆలయం వద్దకు బ్యాండు బాజా భజంత్రీలతో బోనాలను ఊరేగించారు. శివసత్తుల మహిళలు బోనాలు ఎత్తుకొని చేసిన నృత్యాలు, విన్యాసాలు చూపర్లను ఆకర్షించాయి. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. బోనాల పండుగకు విచ్చేసిన ప్రజలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దీంతో మండల కేంద్రంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్..
బహుజన విప్లవ వీరుడు

- ఘనంగా సర్దార్ సర్వాయి
- పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలు గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన బహుజనులకోసం పోరాడిన యోధుడని కొనియాడారు.
-నవతెలంగాణ,విలేకరులు



కమ్మర్‌పల్లిలో.. నివాళ్లు అర్పిస్తున్న గౌడసంఘం సభ్యులు

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయాగ్రామాల్లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను గౌడసంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉప్లూర్‌లో గౌడసంఘంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. సింహాసనం మొక్కితే రాదు ఎదురు వెళ్లి ఢీకొట్టి నిలబడితే వస్తుంది అని చాటి చెప్పిన అగ్గిపిడుగు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడానికి చివరి శ్వాస వరకు పోరాడిన ధీశాలి, బహుజనుల ఆత్మగౌరవ రక్షణకు రాజ్యాధికారమే సమాధానమని విశ్వసించి పోరాడిన యోధుడన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వుట్నూర్ రవి, సదాశివ గౌడ్, రంగు రాజేశ్వర్ గౌడ్, రంజిత్ గౌడ్, సాయ గౌడ్, హరీష్ గౌడ్, భాను గౌడ్, శేఖర్ గౌడ్, రవితేజ గౌడ్, సంజయ్ గౌడ్, రాహుల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ :సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన విప్లవ వీరుడు అని వారు కొనియాడారు. కార్యక్రమంలో బాల్కొండ గౌడ సంఘం మండలాధ్యక్షుడు లింగాగౌడ్ మోకుదెబ్బ మండల అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, అంజా గౌడ్, సాయ గౌడ్, నక్కల శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్, రమేష్ గౌడ్, నాగుల రాజేందర్ గౌడ్, మల్లేష్ గౌడ్, వెంకటేశం గౌడ్, నాగుల పెద్ద రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి :మండలకేంద్రంలో గౌడ కుల సంఘ సభ్యుల అధ్యర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎంపీటీసీ లు గౌడ కుల సంఘ పెద్దమనుషులు, సభ్యులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినాయక్ నగర ప్రాంతంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఆదివారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లాని శివ మాదిగ, జిల్లా నాయకులు దారి హరీష్ మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అఖిల్ మాదిగ, శివ మాదిగ, బొబ్బిలి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్:మండలంకేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గౌడ సంఘం అధ్యక్షులు పుంజు దిలీప్ గౌడ్ మాట్లాడుతూ.. బహుజన హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రను రాబోయే తరానికి తెలిసే విధంగా పుస్తకంలో ముద్రించాలని గౌడ సంఘం నాయకులు తెలిపారు. లండన్ మ్యూజియంలో సర్దార్ పాపన్న చిత్రాన్ని పెట్టడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం నాయకులు, విజయ్ గౌడ్, నర్సా గౌడ్, హన్మ గౌడ్, ప్రహల్లాద్ గౌడ్, ప్రసాద్ గౌడ్ హన్మ గౌడ్, నరేష్ గౌడ్, అజయ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



బాల్కొండలో..



జక్రాన్‌పల్లిలో..

మొదటి తరం స్వతంత్ర సమరయోధుడు ఓబన్న

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మొదటి తరం స్వతంత్ర సమరయోధులు వడ్డెర ఓబన్న అని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రెండవ వార్డులో ఒడ్డెర కులస్తుల మొదటితరం స్వాతంత్ర సమరయోధులు వడ్డెర ఓబన్న విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి చేసిన సాహసోపేతమైన బీకర పోరులో సైనిక అధ్యక్షుడిగా వడ్డె ఓబన్న పోషించిన వీరోచిత పాత్ర చరిత్రలో కథించదగిన విషయం అని అన్నారు. సైనికులతో బ్రిటిష్ వారిపై వీరోచిత పోరాటం చేసి వారిని ఎదిరించి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వారి కుటుంబాన్ని ప్రజలను కాపాడారని తెలిపారు. ఇటువంటి స్వాతంత్ర సమరయోధుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల దేవి అయ్యప్ప శ్రీనివాస్, వైస్ చైర్మన్ షేక్ మున్న, స్థానిక కౌన్సిలర్ కాందేషు సంగీత, రెహ్మాన్, ఆకుల రాము, గండికోట రాజన్న, ఖందేశ్ సత్యనారాయణ, సంఘ కులస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అగస్టు 15 నుంచి నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని నిబంధన అమలు చేస్తున్నందువలన ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని మూడవ టౌన్ ఎస్ఐ నర్సయ్య ప్రజలను కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలోగల గౌతమ్ నగర్ లో మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాలురు నర్సయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ వంతుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, మైనర్ పిల్లలకు వాహనాలను నడపనివ్వకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులకు ఉన్నదని పేర్కొన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తే తల్లిధండ్రులకు శిక్ష పడడమే కాకుండా 20వేల వరకు జరిమానా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని వారు తెలిపారు. పిల్లలను చెడు వ్యసనాల బారిన పడకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులకు ఉంటుందని వారు సూచించారు. కార్యక్రమంలో భాగంగా మూడవ పోలీస్ స్టేషన్ సిబ్బంది షౌకత్ అలీ, రఘు, నర్సింలు, మాజీ కార్పొరేటర్ సాయిరాం, కార్పొరేటర్ రాజు మాయావర్ సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాల్సిందే

- అక్రమ అరెస్టులతో నోరు మూయించలేరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రూపాయల రుణమాఫీ పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు మాఫీ చేసి తీరాల్సిందేనని ముందస్తుగా అరెస్టులు చేసి అక్రమ కేసులు పెట్టి నోరు మూయించలేరని ఇచ్చిన హామీ నెరవేర్చి వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడితేనే ఉంటామని మాజీ ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్, మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ రూరల్ కన్వీనర్ పాశం కుమార్ అన్నారు.ఆదివారం మండలంలోని గన్నారం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కార్యక్రమాన్ని అడ్డుకుంటారని విశ్వసనీయ సమాచారంతో ముందస్తుగా వేకువజామునే పలువురిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వద్ద వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని షరతులు పెట్టి సగం రైతులకు కూడా అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా ఎగనామం పెట్టి రైతు రుణమాఫీ చేసినట్టు చెప్పుకుంటున్నారని, కానీ ఇంకా లక్షల సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతులు బ్యాంకుల వద్ద, సహకార సొసైటీల వద్ద పడి కాపులు కాస్తున్నారని తెలిపారు. గతంలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసినప్పుడు లక్షల్లో ఉన్న సంఖ్య నేడు రెండు లక్షలు మాఫీ చేస్తున్న దానిలో సగం సంఖ్య కూడా ఉండక పోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ ఎంపిటిసి మారంపల్లి సుధాకర్ రవి తో పాటు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం ముగిసిన తర్వాత మాజీ ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ చేరుకొని సంఘీభావం తెలిపారు.

పాపన్న జయంతి బహుమతిగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే




నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వినాయక నగర్ హనుమాన్ జంక్షన్‌లో పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనాడు తురుష్కలు, మొఘలు పెత్తందారుల నిరంకుశ పాలనను అంతమొందించె లక్ష్యంతో పుట్టిన ఓరుగల్లు ముద్దుబిడ్డ బహుజన రాజు సర్దార్ పాపన్న గౌడ్ అని అన్నారు. ఊరును, పల్లెను కొడితే ఏమి ఫలం అని కొడితే గోల్కొండ ఖిల్లాను కొట్టాలని 17వ శతబ్దంలో గోల్కొండ ఖిల్లాను గెలిచిన నాయకుడు సర్దార్ పాపన్న అని తెలిపారు. దోపిడీ దారుల నిరంకుశ పాలనకు ఎదురు తిరిగి ప్రజలను చైతన్యం చేస్తూ గేరిళ్ల యుద్ధ నైపుణ్యాలతో భువనగిరి కోట, గోల్కొండ కోట మొదలైన వాటిని జయించారన్నారు. సర్దార్ పాపన్న జయంతి బహుమతిగా ముఖ్యమంత్రి రేవంత్,కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసి రిజర్వేషన్ 42 శాతం కి పెంచి బహుజనులను రాజకీయంగా ముందుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నత అధికారులు, గీత కార్మికులు ,గౌడ సంఘం సభ్యులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెమీఫైనల్ చేరిన జిల్లా జట్టు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో డాక్టర్ కవిత రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న పదవ మహిళల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో నిజామాబాద్ జిల్లా జట్టు సెమీ ఫైనల్ కు చేరింది. మూడవరోజు ముఖ్యఅతిథిగా ఏఆర్ ఏసిపి నాగయ్య, సీనియర్ క్రీడాకారుడు జావీద్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. సోమవారం జరగనున్న సెమీఫైనల్‌లో నిజామాబాద్ ఖమ్మం మెదక్ నల్గొండ జట్లు సెమీఫైనల్ కు చేరాయని జిల్లా ఫుట్బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మీర్ ఫారుకు మహమ్మద్ జావేద్ లు తెలిపారు. మొదటి సెమీఫైనల్ మెదక్ నల్గొండ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ నిజామాబాద్ ఖమ్మం జట్ల మధ్య జరగనున్నట్లు వారు తెలిపారు. నిజామాబాద్ జిల్లా జట్టుకు కోచ్ గా భక్తపాల్ మేనేజర్గా మహమ్మద్ అజ్మత్ ఖాన్ అసిస్టెంట్ కోచ్గా గొట్టిపాటి నాగరాజు లు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఖలీద్, గిరి, సంయుక్త కార్యదర్శి అన్వర్ సురేష్ ,నరేష్, ఇతర జిల్లాల కార్యదర్శులు వినోద్ ఆదర్శ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఫైర్
- దేశవ్యాప్తంగా షీటీమ్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి
- దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

డాక్టర్ మౌమికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాందేవ్వాడలో వెస్ట్ బెంగాల్ ఆర్‌జికార్ కాలేజీ విద్యార్థిని డాక్టర్ మౌమితపై అత్యాచారం చేసిన నిందితుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి మాట్లాడుతూ..

దేశవ్యాప్తంగా పటిష్టమైన షీ టీం వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకు అశ్లీలత చిత్రాలు పెరిగిపోతున్నాయని, దీన్ని కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని వాపోయారు. మహిళా చట్టాల పకడ్బందీ అమలుకు ప్రభుత్వం పనిచేయాలని అన్నారు. డాక్టర్ మౌమిత కుటుంబానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షమాపణ చెప్పాలని ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కేంద్రం కఠిన చట్టాలను తీసుకురావాలని లేకపోతే ప్రభుత్వాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, జిల్లా ఉపాధ్యక్షులు దీపిక, ప్రసాద్, నాయకులు రాజు,కార్తీక్, అల్తమాస్, వినీత్, శ్రావణ్, వరప్రసాద్, అస్లం తదితర నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఉనికి కోసం ప్రయత్నం

- తప్పుడు ప్రచారాలు.. రెచ్చగొట్టడం మానుకోవాలి
- రైతులను పదేళ్లుగా మోసం చేసింది తెలిసిందే
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ఉనికి లేకుండా చేశారని, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏదో ఒక రకంగా ప్రజల వద్దకు వెళ్ళి సానుభూతి పొందేందుకు, రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని, గత పదేళ్ల పాటు అదికారంలో ఉన్నప్పుడు ఒక లక్ష రూపాయల రైతు రుణమాఫీ చేయకుండా మభ్యపెట్టిందని, ప్రజల వద్దకు పోయె దారి లేక తప్పుడు ప్రచారం చేస్తు రెచ్చగొట్టడం మానుకోవాలని, రాజకీయ కుట్రతోనే ఇవన్నీ డ్రామాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. అదివారం ఇందల్ వాయి మండలంలోని గన్నారం స్వాగత తోరణం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముడు విడతలుగా రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేశామన్నారు. రైతంగానికి రెండు లక్షలు మాఫీ చేస్తే అది చూసి తట్టుకోలేక, ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్ధాలు మాట్లాడుతూ రైతులను తప్పుదోవ పట్టిస్తు ధర్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ పైన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 567 విడుదల చేసిందని అందులో భూమి ఉండి దానిపై రుణం తీసుకున్న కుటుంబానికి 2లక్షల చొప్పున రుణమాఫీ చేస్తామని నియమ నిబంధనలు వెల్లడించడం జరిగిందన్నారు. రుణం మాఫీ కాని వారికోసం ప్రత్యేకంగా వ్యవసాయ అధికారులను నియమించి, మాఫీ కానీ రైతుల వద్దకు వేళ్ళి వివరాలను నమోదు చేసుకుని వారికి మాఫీ అయ్యే విధంగా చూడాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి వివరించారు. ఇంకా నెలరోజుల సమయం ఉందని బ్యాంక్ డేటాలో టెక్నికల్ తప్పిదాలు కొన్ని ఉన్నాయని వాటన్నింటినీ సరి చేసుకుని వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తే రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాలోనే రుణమాఫీ డబ్బులు వేయడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రైతుబంధు పేరుతో రోడ్లకు, గుట్టలకు డబ్బులు ఇచ్చిన ఘనత అ ప్రభుత్వానిదని, అవగాహన లేకుండా ప్రాజెక్టులు నిర్మించడం వల్ల నేడు బీటలు వారాయన్నారు.

సర్దార్ పాపన్న ఎందరికో ఆదర్శం..

ఆనాటి రాజులకు గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కోసం హాలు పెరగని పోరాటం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కోరట్‌పల్లి ఆనంద్, సహకార సొసైటీ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, రాంచందర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు దత్త గౌడ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టి పోలీస్ బందోబస్తు..

బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అడ్డుకుంటారన్న ముందస్తు సమాచారంతో డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె మల్లేష్, ఇందల్ వాయి ఎస్సై మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మహావీర్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మహావీర్ యూత్ సభ్యులు నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. యూత్ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా నల్ల ఉమా మహేష్, ఉపాధ్యక్షుడు ఎండి.నిసార్, కార్యదర్శి జక్కుల దీరజ్, ఉప కార్యదర్శి షేక్, అజీస్, గడ్డం హరీష్, కోశాధికారి కాయపల్లి రాజు, ఈవెంట్ మేనేజ్మెంట్ గౌతమ్, హేమంత్, సలహాదారులు చింటు భూస, జైపాల్ రెడ్డి, దేవేందర్ మెడికల్ నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం 2024-25 సంవత్సరం గాను నిర్వహించడం జరిగిందని యూత్ సభ్యులు పేర్కొన్నారు.

ఏర్గట్లలో భీమన్న స్వామి విగ్రహాల ఊరేగింపు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలో ఆదివారం నాలుగు ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో నూతన భీమన్న స్వామి విగ్రహాలను పల్లకిలో ఉంచి, డప్పు వాయిద్యాలతో, డీజే చప్పుడుతో ఊరేగించారు. ముదిరాజ్ సంఘాలకు చెందిన మహిళలు మంగళహారతులతో ముందు నడుస్తూ.. పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అనంతరం భీమన్న స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి సంఘ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాలుగు సంఘాల పెద్ద మనుషులు, సభ్యులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ గ్రామ అధ్యక్షునిగా సాయగౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బయమొల్ల సాయగౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సాయగౌడ్ తెలిపారు. నాగిరెడ్డిపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగిన మండే వెంకట్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నందున అతని స్థానంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న బయమిళ్ళ సాయగౌడ్ అధ్యక్షుడిగా గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు.